# అలల పోటు..కదలని బోటు


చేపల వేట లేక ఒడ్డున నిలిపిన తెప్పలు

ఎస్.రాయవరం: మండలంలో తుపాను కారణంగా రెండు రోజులుగా మత్స్యకారులు చేపల వేట నిలిపివేశారు. తుపాను హెచ్చరికలు, సముద్రంలో అలలు ఉధృతం కావడంతో రేవుపోలవరం, బంగారమ్మపాలెం మత్స్యకారులు ఒడ్డున తెప్పలు నిలిపివేసి చేపలు వేట ఆపేశారు. వేసవి ప్రారంభ రోజుల్లో వచ్చే తుపానుల తీవ్రత అంచనా వేయలేమని, ముందుగా సముద్రంలోనికి బోటు దింపకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు మత్స్యకారులు తెలిపారు.

**మండలంలో ఓ మోస్తరు వర్షం**

మండలంలో ఆదివారం తెల్లవారు జామున ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు దుక్కి చేసుకునేందుకు వీలుగా కురిసిన వర్షంతో మెరక పొలాల్లో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అపరాలు సాగు చేసుకునే రైతులు చివరి దశలో ఉన్న పంటపై వర్షం కురవడంతో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో మండలంలో ఆదివారం తెల్లవారు జామున కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో మెయిన్‌రోడ్డు పల్లంగా ఉండడంతో భారీగా వరదనీరు నిలిచిపోయింది. ఇటీవల ఎండల వేడికి ఉక్కిరిబిక్కిరైన జనం ప్రస్తుత వాతావరణంతో ఆహ్లాదాన్ని పొందుతున్నారు. కొడవటిపూడి గ్రామంలో రహదారి గోతులమయంగా ఉండడంతో వర్షపు నీటితో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

## క్లుప్తంగా

### మునగపాకలో ఆధ్యాత్మిక మినీ లైబ్రరీ


ఆధ్యాత్మిక గ్రంథాలతో మహిళలు

మునగపాక(అనకాపల్లి): మునగపాక గ్రామంలోని నంది గుడి వద్ద ఆధ్యాత్మిక మినీ గ్రంథాలయం ఆదివారం ప్రారంభించారు. భాగవతం, రామాయణం, సహస్రనామాలకు అర్థం తెలిపే పుస్తకాలు, గణేశ పురాణం వంటి 150 గ్రంథాలను ఈ మినీ లైబ్రరీలో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మిక భావనలు ఉన్న వారు ఈ లైబ్రరీని ఉపయోగించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

### 250 మందికి ఉచిత వైద్యసేవలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బంగారయ్య

ఎస్.రాయవరం : బీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బంగారయ్య రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో అనారోగ్యం బారిన పడి మెరుగైన వైద్యం చేయించుకోలేని వారు చాలా మంది ఉన్నారని, వారికి చారిటబుల్ ద్వారా వైద్య సేవలు అందివ్వడం సంతృప్తినిస్తుందని బంగారయ్య అన్నారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో చారిటబుల్ సభ్యులు శేషు, శ్రీను, రవి, దేవేంద్ర, మహేష్, జైరాం, ప్రసాద్, మణికంఠ, తాతబాబు పాల్గొన్నారు.

### చిలకల తీర్థానికి ఏర్పాట్లు


పేరంటాలమ్మ గుడి

పాయకరావుపేట : పట్టణంలో గల పేరంటాలమ్మ గుడి రంగు రంగులతో అలంకరిస్తున్నారు. సంవత్సరాది నాడు గుడి వద్ద పేరంటాలమ్మ తీర్థం జరుగుతుంది. దీనినే చిలకల తీర్థం అని కూడా అంటారు. సాయంత్రం 4 గంటల నుంచి తీర్థం జరుగుతుంది. ఇక్కడ వున్న పేరంటాలమ్మ గుడిని మహిళలు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటారు. పట్టణానికి చెందిన మలిపెద్ది కుటుంబీకులు గుడికి నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు.

### కె.వి.పురంలో గరగల ఊరేగింపు


కె.వెంకటాపురంలో గరగలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కోటవురట్ల : కొత్త అమావాస్య దగ్గర పడుతుండడంతో గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ఇప్పటికే అమ్మవారి ఆలయాలు ముస్తాబు కాగా సాంస్కృతిక కార్యక్రమాలు, గరగల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. కె.వెంకటాపురంలో ఆదివారం గరగలను ఊరేగించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం కొత్త అమావాస్య పండగను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### రెండు వేల మందికి వాయనాలు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం రెండు వేల మంది ముత్తయిదువులకు వాయనాలుగా జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ అందించారు. అమ్మవారి మాలధారుల సేవా సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో వ్యాపారవేత్త మళ్ల జగప్పారావు, మోహిని దంపతుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ల జగప్పారావు మాట్లాడుతూ ఏటా కొత్త అమావాస్య జాతర మహోత్సవం సందర్భంగా ఈ వాయినాలందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.చంద్రశేఖర్, సంఘం సభ్యులు మళ్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కొలపర్తి శ్రీను, ఉదయ్, అక్షయ్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఫేర్‌వెల్ కార్యక్రమం


నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థినులు


యలమంచిలి : ఉర్రూతలూపే డ్యాన్సులు... విద్యార్థుల కేరింతలు, మార్మోగిన హర్షధ్వానాల నడుమ స్థానిక శ్రీచైతన్య స్కూల్లో 9,10 తరగతుల విద్యార్థులు నిర్వహించిన ఫేర్‌వేల్ పార్టీ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. సంప్రదాయ, ఆధునిక నృత్యాలతో విద్యార్థినీ విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హృషికేస్‌దాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులతా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఏజీఎం సురేష్, ఆర్‌ఐ రమణ, ఏసీవో వెంకటరమణ, డీన్ దత్తు, అసిస్టెంట్ డీన్ లోవేశ్వరరావు పాల్గొన్నారు.

## నూకాలమ్మ జాతరకు సిద్ధం


రంగులతో రూపుదిద్దుకున్న నూకాంబిక ఆలయం

పాయకరావుపేట : కొత్త అమావాస్య సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవార్ల ఆలయాల వద్ద సోమవారం రాత్రి జాతర్లకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత 15 రోజులుగా సంబరాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగవరం గ్రామంలో సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఆలయం వద్ద విద్యుత్ కాంతులతో అలంకరించారు.

## ప్రమాద స్థితిలో మినీ వంతెన


మినీ వంతెన దుస్థితి


బీటలు వారిన పిల్లర్

కోటవురట్ల : తడపర్తి సమీపంలో మినీ వంతెన ప్రమాదస్థితిలో ఉంది. వంతెన బలహీనం కావడంతో కూలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. వంతెన అడుగు భాగాన పిల్లర్ బీటలు వేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొండల్లో వరద నీరు ఎక్కువగా ఉన్నపుడు గెడ్డలో నీటి ఉధృతి ఉంటుంది. ఆ సమయంలో వంతెన బలహీనంగా ఉండడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## పాటిపల్లిలో 'చదవడమంటే మాకిష్టం' కార్యక్రమం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండలంలోని పాటిపల్లి గ్రామంలో మా ఊళ్లో గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 'చదవడం అంటే మా కిష్టం' కార్యక్రమం ప్రారంభించారు. నీతి కథలు, స్వాతంత్ర్య ఉద్యమ కథలను విద్యార్థులతో చదివి వినిపించారు. గ్రంథాలయం కార్యదర్శి ఆదారి అప్పలనాయుడు, సభ్యులు ఏవీఎస్ మూర్తి, బీశెట్టి ధన శ్రీను, యల్లపు సంజీవరావు, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

## నూకాంబిక ఘటాల ఊరేగింపు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి ఘటాలను ఘనంగా ఊరేగిస్తున్నారు. భక్తులు ఘటాలను దర్శించుకొని పూజ లు చేస్తున్నారు. దిమిలి, వెల్చూరు, కొప్పుగొండుపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఘటాలను భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తున్నారు. మంగళవారం అమ్మ వారి జాతరను వైభవంగా నిర్వహించనున్నారు.

## ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్ : ప్రశాంతమైన వాతావరణంలో తెలుగు ఉగాది వేడుకలు నిర్వహించుకోవాలని పట్టణ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచి కేలండర్ తయారు చేయడాన్ని అభినందించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో భగవద్గీత వచనాలను జోడించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించినట్టు పేర్కొన్నారు. ఇందులో దేవాలయ సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండగలు, నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారాన్ని, మానువుడు ఎదుర్కొనే ప్రతి సమస్యకూ పరిష్కార మార్గం చూపే భగవద్గీత సారాంశాన్ని పొందుపరచామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ ప్రత్యేక శిబిరం నేడు

కోటవురట్ల: మండలంలోని యండపల్లి, పాములవాక గ్రామ సచివాలయాలలో సోమ వారం ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్న ట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం ఉంటుందని, కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు వంటి అంశాల ను నమోదు చేయించుకోవాలని సూచించారు.

# అభివృద్ధికి దూరంగా.. కశింకోట రైల్వే స్టేషన్

- 60 ఏళ్ల చరిత్ర.. అయినా స్టేషన్ స్థితి దైన్యం
- గతంలో 8 రైళ్లు ఆగేవి.. ఇవుడు నాలుగే..
- చెంతనే స్టేషన్ ఉన్నా.. అనకాపల్లి వెళ్లాల్సిందే!


కశింకోట రైల్వే స్టేషన్


చెత్తా చెదారం, తుప్పలతో నిండి ఉన్న స్టేషన్ ప్రాంగణం

కశింకోట : మండల కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పట్లేదు. ఈ స్టేషన్ సుమారు 60 ఏళ్ల క్రితం ఏర్పడింది. కశింకోట, వెదురుపర్తి, సంపతిపురం, పిసినికాడ తదితర ప్రాంతాలకు ఈ స్టేషనే పెద్ద దిక్కు. విశాఖలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు, కూరగాయల వ్యాపారులు, ప్రయాణికులకు ఈ స్టేషనే ప్రధాన కేంద్రం. ఇక్కడి నుంచే యలమంచిలి, తుని, అన్నవరం, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

**సదుపాయాలు నిల్**

స్టేషన్లో సరైన సదుపాయాలు లేవు. ప్లాట్‌ఫారాలు ఎత్తు చాలా తక్కువ. దీంతో రైలు ఎక్కి, దిగడానికి ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. రైలు ఎక్కేటపుడు.. దిగేటపుడు ఏ మాత్రం ఏమరుపాటుగా కిందపడిపోవడం ఖాయం. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు, మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొందరు అనకాపల్లి వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి. ఒకవైపు స్టేషన్ ఆవరణలో తుప్పలు పెరిగి, చెత్త పేరుకుపోయి అధ్వానంగా ఉంది. విషసర్పాలు, పురుగులు చేరడంతో ప్రయాణికులు ఆందోళనపడుతున్నారు. వీటిని తొలగించి శుభ్రపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రయివేటీకరణతో ఇక్కట్లు**

స్టేషన్ గతంలో రైల్వే శాఖ సిబ్బందితో నడిచేది. దాన్ని ప్రైవేటీకరించి టిక్కెట్ల విక్రయాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో స్టేషన్ ఆలనాపాలనా సరిగా చూసే నాథుడు లేక అభివృద్ధికి దూరంగా ఉంది. అనకాపల్లి జిల్లా కేంద్రానికి అతి చేరువలో ఉన్న స్టేషన్ అన్ని విధాలా అభివృద్ధి చేసి సదుపాయాలు మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ఆగే రైళ్లు నాలుగే!**

కశింకోట స్టేషన్‌లో రానూ పోనూ నాలుగు రైళ్లే నిలుస్తున్నాయి. కాకినాడ-విశాఖ, రాజమండ్రి-విశాఖల మధ్య రానూ పోనూ నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఇవి గతంలో పాసింజర్లుగా నడిచేవి. వాటినే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు చేసి తాజాగా నడుపుతున్నారు. దీంతో కశింకోట-విశాఖ మధ్య రూ.15 ఉండే టిక్కెట్ ధర కూడా రెట్టింపు అయింది. అయితే ఇవి సకాలంలో రాకపోవడం వల్ల ఉద్యోగ విధులకు, విద్యా సంస్థలకు, గమ్యాలకు సకాలంలో చేరలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కరోనాకు ముందు 8 రైళ్లు ఆగేవి. ఇప్పుడు అవి సగానికి పరిమితమయ్యాయి.

**ఆ రెండు రైళ్లను నిలపాలి**

గతంలో పాసింజర్లుగా నడిపే రాయగడ-విజయవాడ, విశాఖ-విజయవాడల మధ్య నడిచే రైళ్లను ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా మార్చారు. వాటిని ఇప్పుడు కశింకోటలో నిలపట్లేదు. ఇక్కడి నుంచి విజయవాడ, రాయగడ, విజయనగరం, బొబ్బిలి తదితర ప్రాంతాలకు రాయగడ పాసింజర్ రైలుపై గతంలో ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఈ రైలు విశాఖ రాకపోకలకు చాలా అనువుగా ఉండేది. దీంతో ఈ రైళ్లపై ఆధారపడే వారు అనకాపల్లి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి నుంచి కశింకోట రాకపోకలకు బస్సు చార్జీలు అదనం. ఎక్స్‌ప్రెస్‌లుగా నడుపుతున్న రాయగడ-గుంటూరు, విశాఖ-మచిలీపట్నం రైళ్లను కశింకోట స్టేషన్లో నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## వేడుకగా గరగల ఊరేగింపు


చినగుమ్ములూరులో అమ్మవారి గరగలను నెత్తిన పెట్టుకుని మొక్కుకొంటున్న యువతులు

ఎస్.రాయవరం : గ్రామాల్లో కొత్త అమావాస్య వేడుక పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి గరగలు ఊరేగింపు పెద్ద ఎత్తున చేపట్టారు. మరో రెండు రోజుల్లో అమ్మవారి జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వీధుల్లో అమ్మవారి గరగలు మరింత ఉత్సాహంగా తిప్పుతున్నారు. గరగలను భక్తులు వారి శిరస్సుపై ఉంచుకుని మొక్కు చెల్లించుకుంటారు. యువతులు, గృహిణులు అమ్మవారి ఊరేగింపు వీధుల్లోకి రాగానే వీధులను శుద్ధి చేసి గరగలను దర్శించుకుంటున్నారు. మంగళవారం చినగుమ్ములూరు, తిమ్మాపురం, సర్వసిద్ధి, గుర్రాజుపేట తదితర గ్రామాల్లో కొత్త అమావాస్య జాతరను వైభవంగా నిర్వహిస్తారు.

## రాములోరి కల్యాణానికి ఆలయాల ముస్తాబు


పాయకరావుపేటలో ముస్తాబైన రామాలయం

పాయకరావుపేట : ఈ నెల 30 న శ్రీరామనవమి సందర్భంగా మండలంలో ఆయా గ్రామాల్లో గల రామాలయాలు ముస్తాబవుతున్నవి. సీతారాముల కల్యాణానికి ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు రామాలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. రంగులతో అలంకరిస్తున్నారు. పట్టణంలో గల సీతారాముల దేవాలయం, అరట్లకోట, మంగవరం, పెంటకోట తదితర గ్రామాల్లో గల రామాలయాలకు రంగులతో మెరుగులు దిద్దుతున్నారు. పాయకరావుపేట, మంగవరం గ్రామాల్లో గల రామాలయాల వద్ద చలువ పందిళ్ళు, తాటాకులతో పెద్ద పెద్ద పందిళ్ళు వేశారు. శ్రీరామనవమికి సీతారాములను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## మల్లు స్వరాజ్యం సేవలు ఆదర్శనీయం


రాంబిల్లిలో మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేముడునాయుడు తదితరులు

రాంబిల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం సేవలు ఆదర్శప్రాయమని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు అన్నారు. రాంబిల్లిలో ఆదివారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. స్వరాజ్యం చిత్రపటానికి దేముడునాయుడు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూస్వాముల కుటుంబంలో జన్మించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడ్డ మహోన్నత వ్యక్తి స్వరాజ్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్ గంగరాజు, ప్రజా సంఘాల నాయకుడు శివాజీ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు టాటా సాయం


గోకివాడలో వరలక్ష్మికి సెల్‌ఫోన్ అందజేస్తున్న సర్పంచ్ శారద

రాంబిల్లి : టాటా ఏఐజీ సంస్థ ఆర్థిక సాయంతో బీసీటీ సంస్థ ద్వారా మండలంలో పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు సెల్‌ఫోన్లు, ఫ్లోర్ మిల్లు మిషన్లు, వెట్ గ్రైండర్లను అందజేశారు. గోకివాడ సర్పంచ్ చేతుల మీదుగా వరలక్ష్మికి సెల్‌ఫోన్ అందజేశారు. మామిడివాడ, దిమిలి, కట్టుబోలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఆయా గ్రామాల సర్పంచ్‌ల చేతుల మీదుగా సెల్‌ఫోన్లు అందజేశారు. గోకివాడ, చినకలవలాపల్లి, దిమిలి, మునగపాక, యలమంచిలి ప్రాంతాల దివ్యాంగులకు వెట్ గ్రైండర్లు, ఫ్లోర్ మిల్లు మిషన్లు అందజేసినట్టు బీసీటీ ప్రతినిధి శిగిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు.

## ఘనంగా తాకాశివీధి నూకాంబిక జాతర


కాళీమాత నృత్యాలు


ఆలయం నుంచి మొదలైన గరగల ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక తాకాశివీధి స్వయంభూ నూకాంబిక ఆలయంలో అమ్మవారి కొత్త అమావాస్య జాతర వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. శనివారం ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం భజన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయం నుంచి గరగల ఊరేగింపు, తోడపెద్దుసేవ, కోలాటాలు, పులివేషాలు, న్యూకాంతార, లేడీస్ తీన్‌మార్, డూప్స్ బాబోయ్ డూప్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 20 వరకు నెల రోజులపాటు అత్యంత వేడుకగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడ అమ్మవారు పుట్ట నుంచి వెలిసినట్టు చెప్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు కొలుస్తుంటారు. సోమవారం సాయంత్రం 6 నుంచి మంగళవారం ఉదయం వరకు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పిస్తారు. 21న అమ్మవారికి అమావాస్య పూజ చేస్తారు. 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు దీపాలంకరణలో దేదీప్యమానంగా అమ్మవారి దర్శనం లభించనుంది. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ మాట్లాడుతూ ఇప్పటికే ఆలయంలో జాతరను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. క్యూలైన్‌లు, తాగునీరు వంటి మౌలిక సాదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## కర్షక సమావేశం విజయవంతం చేయాలి

కె.కోటపాడు: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను ప్రకటించడంతో పాటు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసే వరకూ సీపీఎం పోరాటం చేస్తుందని పార్టీ నాయకుడు గండి నాయినిబాబు తెలిపారు. సూర్రెడ్డిపాలెంలో ఆదివారం ఆయన రైతులను కలిశారు. కర్షకుల సమస్యలను ఢిల్లీ స్థాయిలో చాటి చెప్పేందుకు సీపీఎం ఆధ్వర్యంలో వచ్చే నెల 5న ఢిల్లీలో కర్షక సమావేశాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణను చేసి కార్మికుల పొట్టకొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు రేపు

దేవరాపల్లి: ఎం. అలమండలో నూకాంబిక అమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహించనున్నట్లు సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందే ఎడ్లబళ్లకు రూ.20 వేలు, రూ.16 వేలు, రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



## 'ఏపీ కో సేవా' అధ్యక్షునిగా ఈశ్వరరావు

అనకాపల్లిటౌన్ : ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సర్వీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఏపీ కో సేవా) అడ్‌హక్ కమిటీ అధ్యక్షునిగా ఎస్.ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవోస్ భవనంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా సీహెచ్ రమణ, కోశాధికారిగా రామస్వామి, జిల్లా కో ఆర్డినేటర్‌గా బి.త్రినాథ్‌లు ఎన్నికయ్యారు.

## 725 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పాడుగుపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న సాయికుమార్

కె.కోటపాడు: పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా ఉండడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు గాలికుంటు నివారణ టీకాలను వేస్తున్నట్లు ఎ.కోడూరు ఆర్బీకే పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. ఆర్బీకే పరిధిలోని పాడుగుపాలెంలో ఆదివారం గాలికుంటు నివారణ టీకాలను పశువులకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువుల నోటి, కాలిగిట్టల భాగంలో పుండ్లుగా ఏర్పడడంతోపాటు బాగా నీరసించి పోతాయని వివరించారు. అధిక ఉష్ణోగ్రత బారిన పడడం వల్ల మరణించే అవకాశం ఉంటుందన్నారు. ఎ.కోడూరు ఆర్బీకే పరిధిలో 725 పశువులకు టీకాలను వేశామని, మిగిలిన పాడి రైతులు తప్పనిసరిగా వేయించాలని సాయికుమార్ కోరారు.